

సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అన్నప్రసాద వితరణ
విజయవాడకల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కొలుసు సోమేశ్వరరావు, శేషారత్నం దాతలుగా వ్యవహరించారు.



గర్భగుడిని తాకిన సూర్య కిరణాలు
నందిగామ: స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం గర్భగుడిలోకి సూర్య కిరణాలు ప్రసరించాయి. భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

కొండచరియల తొలగింపు
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్ ఎదుట కొండచరియల తొలగింపు పనులు శనివారం కూడా కొనసాగించారు. ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ నుంచి దుర్గగుడి వైపునకు, కుమ్మరిపాలెం వైపు నుంచి దుర్గగుడి వైపునకు వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించారు. శనివారం ఉదయం నుంచి ప్రారంభించిన పనులు సాయంత్రం వరకు కొనసాగాయి. గతంలో దుర్గాఘాట్ నుంచి దుర్గగుడి ఘాట్ రోడ్డును అనుసంధానం చేస్తూ నిర్మించిన ఫుట్ బ్రిడ్జి శిథిలాలు సోమవారం విరిగిపడిన విషయం విదితమే. దుర్గగుడి ఘాట్‌రోడ్డు వైపు నుంచి పొక్లెయిన్‌తో కొండచరియలు, మట్టి, రాళ్లను తొలగించారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దేవస్థానం ఈ పనులను చేపట్టినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేయండి
జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



చిలకలపూడి(మచిలీపట్నం): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పదోన్నతులపై ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పనిచేస్తూ వివిధ కారణాల ద్వారా మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ నియామకాలను అందిస్తూ శనివారం నియామకపత్రాలతో పాటు ఉద్యోగులకు ఉద్యోగోన్నతుల ఆర్డర్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఇంజినీరింగ్ విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా ఐదుగురిని, టైపిస్టుగా ఏడుగురిని, ఆఫీస్ సబార్డినేట్లుగా ఇరువురిని నియమించారన్నారు. ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఇరువురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారని తెలిపారు. జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో జి.శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం
ఉయ్యూరు: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చిత్ర అన్నారు. ఉయ్యూరు పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సర్వే చేయాలన్నారు. బీపీ, మధుమేహం, జ్వరం, రక్తపరీక్షలు నిర్వహించి ఎవరికైతే అనారోగ్య సమస్యలు ఉన్నాయో వాటిని సర్వేలో గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడే వారందరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చి వైద్యసేవలు పొందాలన్నారు. ఉయ్యూరులో ఈనెల 30న మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశీలనలో డాక్టర్ దీప,సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతే పుడమికి క్షేమం



మచిలీపట్నం శ్రీ బాలాజీ విద్యాలయంలో సాక్షి మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తున్న చిన్నారులు



చిన్నారులు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాల వద్ద పేర్ని కిట్టు, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు భారతి, విజయలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



- బంక మట్టితో విఘ్నేశ్వరుని రూపాలు
- సాక్షి మీడియా గ్రూప్ -కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రతిభా పోటీ
- కొనియాడిన డీఈఓ, నగర మేయర్, పేర్ని కిట్టు
- ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులు అందజేత
- విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన



ప్రథమ బహుమతి విజేత కీర్తి ప్రణీతకు బహుమతి అందజేస్తున్న డీఈఓ, మేయర్, డెప్యూటీ మేయర్లు

మచిలీపట్నంటౌన్: సాక్షి మీడియా గ్రూప్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ బాలాజీ విద్యాలయంలో నిర్వహించిన మట్టి గణపతి ప్రతిమల తయారీ పోటీలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. విద్యార్థులు బంక మట్టితో కాలుష్య రహిత గణనాథుని విగ్రహాలను పలు ఆకృతుల్లో ఆకర్షణీయంగా తయారు చేశారు. వినాయక చవితి రోజున పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా మట్టి గణనాథుని విగ్రహాలతోనే పూజించాలనే ప్రధాన సూచనతో పోటీలు నిర్వహించారు. గణనాథుని విగ్రహాన్ని ఎలా తయారు చేయాలో సాక్షి మీడియా ప్రదర్శించిన వీడియోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించి ప్రతిమలను తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వినాయక ప్రతిమలు చూపరులను ఎంతగానో ఆకర్షించాయి. ప్రతిమల తయారీలో ప్రతిభ కనబర్చిన 10 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డీఈఓ తాహెరా సుల్తానా, డీఎస్‌వో జాకీర్‌హుస్సేన్, నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), డెప్యూటీ మేయర్‌లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, బాలాజీ విద్యాలయం ప్రిన్సిపాల్ కొమరగిరి చంద్రశేఖర్, 13వ డివిజన్ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్, సాక్షి యాడ్ ఆఫీసర్ ఎస్ఎన్ శ్రీనివాసరావు, సాక్షి మచిలీపట్నం ఆర్సీ ఇన్‌చార్జ్ అంబటి శేషుబాబు, సాక్షి సీనియర్ రిపోర్టర్ పైడిపాముల అశోక్ కుమార్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

మట్టి గణనాథుల తయారీ మంచి పరిణామం

ఈ సందర్భంగా జరిగిన సభలో డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ మట్టి గణపతుల తయారీ చాలా మంచి పరిణామమన్నారు. ఈ ప్రక్రియ అన్ని పాఠశాలల్లో ప్రారంభమైతే రానున్న రోజుల్లో ప్లాస్టరాఫ్ ప్యారిస్, రసాయన రంగులతో తయారయ్యే గణనాథుల వాడుక చాలా వరకూ తగ్గుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలిలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. మట్టి గణనాథుని విగ్రహాలు తయారు చేసి వాటితోనే పండగపూట పూజలు చేసేందుకు విద్యార్థులు పూనుకోవటం శుభ పరిణామమని నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. సాక్షి, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల్లో చిన్న నాటి నుంచే ఈ మార్పునకు కృషి చేయటం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే
బంక మట్టి గణనాథులను ఆకర్షణీయంగా రూపొందించిన శ్రీ బాలాజీ విద్యాలయంకు చెందిన 10 మంది విద్యార్థులు విజేతలుగా ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థిని కీర్తి ప్రణీత ప్రథమ, 7వ తరగతి విద్యార్థి ఎ.చక్రీష్ ద్వితీయ, 8వ తరగతి విద్యార్థి ఆదిత్య వర్ధన్ తృతీయ స్థానాలను దక్కించుకోగా వీరికి బహుమతులను అందజేశారు. మరో ఏడుగురు విద్యార్థులు కె.దేవీచంద్, పి.హోనాక్, సీహెచ్ మోహిత్, జి.జయరామ్, కె.అభిలాష్, ఎ.సాయికార్తీక్, ఎన్.చరణ్ సంపత్ కన్సొలేషన్ బహుమతులను అందుకున్నారు.

మంచి ఆరోగ్యానికి మట్టి గణపతి



మట్టి గణపతుల వినియోగంతో పర్యావరణ హితం జరుగుతుంది. దీని కారణంగా మానవులకు మంచి ఆరోగ్యం లభిస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల వాతావరణ, నీటి కాలుష్యం ఏర్పడుతుంది. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు మట్టి గణనాథులను పూజించాలి.

– కీర్తి ప్రణీత, ప్రథమ బహుమతి విజేత

వ్యవసాయానికి మట్టి గణనాథులు దోహదం



మట్టి గణనాథులను వినియోగించటం ద్వారా వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉంటుంది. పూజలు నిర్వహించిన అనంతరం మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయటం వల్ల వ్యవసాయానికి మేలు జరుగుతుంది.

– ఎ.చక్రీష్, ద్వితీయ బహుమతి విజేత

గాలి, నీరు కలుషితం కావు



మట్టి గణనాథులను వినియోగించి నిమజ్జనం చేయటం వల్ల వాతావరణం కాలుష్యం కాదు కాబట్టి మనుషుల ఆరోగ్యం క్షేమంగా ఉంటుంది. పంటలు బాగా పండుతాయి.

– ఆదిత్య వర్ధన్, తృతీయ బహుమతి విజేత

కుటుంబానికి ఆర్థిక కాపు



లబ్ధిదారులకు కాపునేస్తం చెక్కును అందజేస్తున్న జేసీ అపరాజితసింగ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

- వైఎస్సార్ కాపునేస్తం నాలుగో విడత పంపిణీ
- జిల్లాలో 23,110 మంది లబ్ధిదారులు
- రూ.34.67 కోట్ల నగదు జమ
- లబ్ధిదారులకు చెక్కు అందజేసిన జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కాపునేస్తం పథకం మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తోందని కృష్ణాజిల్లా జేసీ అపరాజితసింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలులో వైఎస్సార్ కాపునేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు ద్వారా వీక్షించిన అనంతరం జేసీ అపరాజితసింగ్ లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాది కాపునేస్తం పథకం ద్వారా లబ్ధిదారులకు వారి ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు మూడు విడతల్లో 66,825 మంది లబ్ధిదారులకు రూ.100.24 కోట్లు అందించామన్నారు. ఈ ఏడాది 23,110 మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి మహిళలకు రూ.34.67 కోట్ల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి లబ్ధి చేకూరకపోతే వెంటనే ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు వివరాలతో వలంటీర్లను సంప్రదించాలన్నారు.

జిల్లాలో 23,110 మందికి లబ్ధి

జిల్లాలో 23,110 మంది మహిళలకు లబ్ధి చేకూరినట్లు జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో 6,881 మంది లబ్ధిదారులకు రూ.10.32 కోట్లు, గన్నవరం నియోజకవర్గంలో 1417 మంది లబ్ధిదారులకు రూ.2.12 కోట్లు, గుడివాడ నియోజకవర్గ పరిధిలో 1694 మంది లబ్ధిదారులకు రూ.2.54 కోట్లు, మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో 3,956 మంది లబ్ధిదారులకు రూ.5.93 కోట్లు, పామర్రు నియోజకవర్గ పరిధిలో 2,221 మంది లబ్ధిదారులకు రూ.3.33 కోట్లు, పెడన నియోజకవర్గ పరిధిలో 4,489 మంది లబ్ధిదారులకు రూ.6.73 కోట్లు, పెనమలూరు నియోజకవర్గ పరిధిలో 2,452 మంది లబ్ధిదారులకు రూ.3.67 కోట్లు అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు లబ్ధిదారులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ రైల్–స్వచ్ఛ భారత్' అవగాహన ర్యాలీ

జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన డీఆర్ఎం



రైల్వేస్టేషన్ పరిసరాలను శుభ్రపరుస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో ఈ నెల 16 నుంచి అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛ రైల్–స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో భాగంగా శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు ప్రధాన ద్వారం వద్ద అధికారులు, సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులతో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. స్టేషన్ పరిసరాలలో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం క్లాక్ టవర్ నుంచి జాక్ అండ్ జిల్ స్కూల్ మీదుగా ప్లాట్‌ఫామ్ 1లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సులభంగా పునర్వినియోగానికి ఉపయోగపడే క్లాత్ బ్యాగులు, పేపర్ బ్యాగులు, జనపనార సంచులను ఉపయోగించాల్సిందిగా సూచించారు. స్టేషన్ ఆవరణలు, కార్యాలయాలలో స్వచ్ఛందంగా 100 గంటలు పరిశుభ్రతలో పాల్గొనాల్సిందిగా సిబ్బందికి సూచించారు. అనంతరం స్వచ్ఛత అవగాహనపై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శించిన నాటకం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వావిళ్లపల్లి రాంబాబు, ఏసీఎంఎస్ ఎల్.రవికిరణ్, సీనియర్ డీపీఓ బాలమురళీధర్, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లయిమ్ ఫారాలను రెండు రోజుల్లో పరిష్కరించండి
టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమానికి సంబంధించిన క్లయిమ్ ఫారాలను రెండు రోజుల్లో పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఓటర్ల జాబితా సవరణ, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు తొలగింపులు, చేర్పులు, మార్పులకు సంబంధించి వచ్చిన క్లయిమ్ ఫారాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఒకే ఇంటిలో 10 కంటే ఎక్కువగా ఓట్లు ఉంటే మరోసారి పరిశీలించి పక్కాగా రికార్డులు నిర్వహించాలన్నారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి ప్రతి అధికారి ఒక డైరీ ఏర్పాటు చేసుకుని అందులో పర్యటించిన మండలం, గ్రామం, అర్జీదారుని పేరు, పరిష్కరించిన సమస్య, మాట్లాడిన తీరు ఫొటో, వీడియోతో సహా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని మండలాల్లో పూర్తయిన తరువాత శాఖలు, సమస్యల వారీగా ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పరిష్కరించాల్సి ఉన్నాయనే వివరాలు అందజేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఏ ఇంట్లో ఎవరు ఏ అనారోగ్యంగా ఉన్నా నమోదు చేసుకుని వారికి టోకెన్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 30న జరిగే వైద్య, ఆరోగ్య శిబిరంలో వైద్యసహాయం, చికిత్సలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పి.వెంకటరమణ పాల్గొన్నారు.

● గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అవనిగడ్డ: తుంగలవారిపాలెం వంతెన వద్ద పంటకాలువలో మృతదేహం ఉందని స్థానికులు సమాచారం అందించగా బయటకు తీశామని ఎస్ఐ రమేష్ చెప్పారు. మృతదేహం బాగా కుళ్లిపోయిందని, మృతుని వయస్సు 30 సంవత్సరాలు పైబడి ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 08671 272333, 94407 96467లో సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఈవో భ్రమరాంబకు విరాళం అందజేస్తున్న దాత



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న పాలక మండలి సభ్యుడు సత్తెయ్య

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన పలువురు భక్తులు శనివారం విరాళాలను అందజేశారు. విజయవాడ పులిపాటి వారి వీధికి చెందిన మామిడి లక్ష్మీ వెంకట కృష్ణారావు శనివారం ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళం ఇచ్చారు. తాడిగడపకు చెందిన డి.రఘురామ్, నాగ లక్ష్మి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారాలకు అందజేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబు, ఈఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిమాన్ష్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



హిమాన్ష్ సాధించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్



చిన్నారి బండి హిమాన్ష్

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు బండి హిమాన్ష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించాడు. వివరాలలోకి వెళితే హిమాన్ష్ 50 సెకన్లలో దేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లు చెప్పడాన్ని తల్లిదండ్రులు ఉదయ్‌కుమార్, ప్రియాంక రికార్డ్ చేసి ఆన్‌లైన్ ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ప్రతిభను గుర్తించి కొరియర్ ద్వారా హరియాణా నుంచి గోల్డ్ మెడల్, రికార్డ్స్ బుక్, సర్టిఫికెట్‌లు, ఐడీ కార్డు పంపించారు. 20 రకాల పండ్లు, 18 రకాల కాయగూరలు. 20 రకాల వాహనాలు, 40 రకాల జంతువులు, 50 రైయిమ్స్, జాతీయ గీతం పాడిన వీడియో కూడా పంపినట్లు తెలిపారు. గ్రామస్తులు చిన్నారిని అభినందించారు.

ఓజోన్ పొర సంరక్షణతో మనుగడ

డీఈవో తాహెరాసుల్తానా



మాట్లాడుతున్న డీఈవో తాహెరాసుల్తానా, చిత్రంలో డీఎస్‌వో జాకీర్ అహ్మద్, డీవైఈవో సుబ్బారావు

మచిలీపట్నంటౌన్: ఓజోన్ పొర సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని కృష్ణా డీఈవో తాహెరాసుల్తానా అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ సంస్థ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఓజోన్ డే, మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమం శనివారం స్థానిక రాంజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మానవ మనుగడకు ఓజోన్ పొరను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓజోన్ పొర దెబ్బతింటే సూర్యుని కిరణాలు ప్రత్యక్షంగా వచ్చి మానవ శరీరంపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, మానవ హారం, గొడుగులతో ర్యాలీ, మట్టి గణనాథుల తయారీ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్, ఎన్‌సీజీ జిల్లా కో-ఆర్డినేటర్ మొహమ్మద్ జాకీర్ అహ్మద్, డీవైఈవో యూవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని నోబుల్ కళాశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌జె ఎర్నెస్ట్ ఓజోన్ పొర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి మంజుల శ్రీవేణి, వృక్ష శాస్త్రాధిపతి ఎం.సుస్మిత తదితరులు పాల్గొనగా విద్యార్థులకు ఓజోన్ పొర క్షీణత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్.సంజయ్ ఆదేశాల మేరకు విజయవాడ రీజియన్ సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆర్.రాజశేఖరరావు ఆధ్వర్యాన నగరంలోని దుర్గాపురం సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐడీ సూపరింటెండెంట్ వి.రత్న మాట్లాడుతూ సీఐడీ విభాగం రాష్ట్రంలో అన్ని జిల్లాల పోలీస్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ అధికారులతో నిత్యం సమన్వయంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేస్తూ కేసుల్లో పురోగతి దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు సకాలంలో ప్రభుత్వం నిర్దేశించిన నష్టపరిహారం అందడానికి, దర్యాప్తు అధికారులు త్వరితగతిన సాక్ష్యం సేకరించి చార్జిషీట్ వేసేలా, కేసు కోర్టులో విచారణకు వచ్చేలా, ముద్దాయిలకు శిక్ష పడేలా సీఐడీ విభాగం పర్యవేక్షిస్తుందన్నారు. రాష్ట్రంలో సీఐడీ సదరు కేసులను ఏ విధంగా మానిటరింగ్ చేస్తుంది, కేసుల దర్యాప్తు, చార్జిషీట్ ఫైల్ చేసే విధానాన్ని గణాంకాలతో వివరించారు. ఎన్టీఆర్ జిల్లా డీసీపీ మోకా సత్తిబాబు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, సుమారు 500 మంది విద్యార్థులు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ పల్టీ.. హెల్పర్ మృతి



దొనబండ రాతి క్వారీలో పల్టీ కొట్టిన జేసీబీ

కంచికచర్ల: రాతి క్వారీలో ప్రమాదవశాత్తు జేసీబీ పల్టీ కొట్టటంతో హెల్పర్‌గా చేస్తున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పరిటాల శివారు దొనబండ ఓ రాతి క్వారీలో జార్ఖండ్‌కు చెందిన అనిల్‌యాదవ్(33) జేసీబీ హెల్పర్‌గా చేస్తున్నాడు. క్వారీలో కంకర రాళ్లను తొలగించే సమయంలో ప్రమాదవశాత్తు జేసీబీ పల్టీ కొట్టింది. ఘటనలో జేసీబీపై ఉన్న హెల్పర్ కిందభాగాన పడిపోయి మృతి చెందాడు. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. అనిల్‌యాదవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



ఉయ్యూరు: విద్యుత్ షాక్‌కు గురై కౌలురైతు మృతి చెందిన ఘటన మండలంలోని కలవపాములలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కౌలురైతు సోలే వెంకటేశ్వరరావు (65) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రెండెకరాలకు పైగా కౌలుకు పొలం తీసుకుని వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తున్నాడు. పశువులమేత కోసం పొలానికి వెళ్లాడు. విద్యుత్ మోటరు సమీపంలో పచ్చగడ్డి కోస్తుండగా మోటారుకు చెందిన విద్యుత్ తీగ తెగి షాక్‌కు గురై పడిపోయాడు. ఘటనా స్థలంలోనే వెంకటేశ్వరరావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పొనుగుమాటి బాలస్వామి, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

యువతి బలవన్మరణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): క్షణికావేశంలో యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో శనివారం చోటు చేసుకుంది. ఘటనపై యువతి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 64లో రెడ్డి లీల, శంకరరావు నివసిస్తున్నారు. భర్తతో విభేదాల కారణంగా శంకరరావుతో విడిపోయింది. భూపతి ప్రసాద్ అనే వ్యక్తితో సహజీవనం సాగించేది. అతనితో గొడవలు జరగడంతో ఆమె విడిపోయింది. రెడ్డి లీలకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె యమునకు వివాహమైంది. చిన్న కుమార్తె లక్ష్మి(18) వస్త్రలతలో పని చేస్తుంటుంది. ఆమె 20 రోజులుగా షాపునకు వెళ్లకపోవడంతో తల్లి మందలించింది. శనివారం లీల బయటకు వెళ్లింది. ఆ సమయంలో లక్ష్మి ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో లీల ఇంటికి వచ్చి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. స్థానికుల సాయంతో తలుపులు బలవంతంగా తెరిచి చూడగా లోపల ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.